క్లుప్తంగా

చిన్నారాయుడుపేటలో సీసీరోడ్డు, కాలువ పనులు



సీసీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని సూరంపేట పంచాయతీ చిన్నారాయుడుపేటలో సర్పంచ్ చిట్టపలి అప్పన్నమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం జరుగుతోందని కార్యదర్శి మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఏఈ చంద్రమౌళి సూచనల మేరకు గ్రామ ప్రధాన వీధిలో కాలువ, సీసీ రోడ్డు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న కారణంగా గ్రామ పంచాయతీ నిధులతో సీసీరోడ్డు, కాలువ పనులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, మాజీ సర్పంచ్ సాంబన్నదొర, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్‌లకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించండి



జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: 2024లో ఉత్తీర్ణత సాధించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు అభ్యర్థులు డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల పాస్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపించారని, ఉత్తీర్ణులైన అభ్యర్థులందరూ తప్పనిసరిగా తమ హాల్‌టికెట్ చూపించి పాస్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని పేర్కొన్నారు.

కాఫీ సాగుపై సంయుక్త సర్వే



కాఫీ సాగును పరిశీలిస్తున్న అధికారులు

పాచిపెంట: మండలంలోని శతాబి, గరిసిగుడ్డి, తంగ్లాం పంచాయతీ గ్రామాలలో ఐటీడీఏ కాఫీబోర్డు, ఉద్యానవనశాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం శతాబిగ్రామంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. కాఫీ పంట సాగుకు అనుకూల పరిస్థితులు తదితర అంశాలను వివరించారు. కాఫీ సాగు విస్తరణ కోసం పలు సూచనలు చేశారు. దిగుబడి పెంపుదలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీఆర్‌ఎస్ శాస్త్రవేత్త సునీల్‌బాబు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి శ్యామల, పీఏఓ శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.


తక్షణ సాయం అందించి ప్రాణాలు కాపాడండి


పార్వతీపురంటౌన్: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణసాయం అందించి ప్రాణాలు కాపాడాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులు, జన కూడలి ప్రదేశాల్లో గుడ్ సామారిటన్ పోస్టర్లను అతికించి గోల్డెన్ అవర్‌లపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన గంటలోగా క్షతగాత్రులను దగ్గరుండి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వారే నిజమైన హీరో అని అభివర్ణించారు. గాయపడిన వారి పట్ల కరుణ, సాయం చేసే మానవత్వం ఉండాలని హితవు పలికారు. క్షతగాత్రులకు సాయం చేసిన వారికి ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి. కాశీరాం నాయక్, ఎ.వరప్రసాద్, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పాత మేట్‌లను కొనసాగించాలి

సీతానగరం: మండలంలోని నిడగల్లులో పాత మేట్‌లను కొనసాగిస్తూనే కొత్తమేట్‌లను అవసరాలకు అనుగుణంగా నియమించాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిడగల్లు వికలాంగ వేతనదారులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.
ఈ మేరకు సీఐటీయూ డివిజన్ నాయకుడు వెంకటరమణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా నిడగల్లులో వీరంతా పని చేస్తున్నారని అప్పట్లో నియమితులైన వారిలో ఒకరిని మేట్‌గా నియమించుకున్నారన్నారు. ఇప్పుడా మేట్‌లను తొలిగించి కొత్తవారిని అధికారులు నియమించడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, అందుకు వేతనదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. పాలకులు మారినప్పుడల్లా మేట్‌లను మార్చడం తగదన్నారు. కార్యక్రమంలో వికలాంగ వేతనదారులు పాల్గొన్నారు. వారంతా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావుకు అందజేశారు.

సందడిగా శంబర జాతర





- భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర, ప్రసాదాలు పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థలు
- జాతరలో అద్భుతంగా సేవలందించిన మక్కువ పోలీసులు
- జాతరకు గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు, రైతుల సహకారం
- సిరిమానును సజావుగా నడిపించిన యువత
- రెవెన్యూ,పంచాయతీ, మెడికల్ అండ్ హెల్త్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ సేవలు ఘనం



గోముఖి నదిలో భక్తులు మొక్కుల చెల్లింపు, , (ఇన్‌సెట్లో) వనంగుడిలో పెదపోలమాంబ అమ్మవారు



సిరిమానును నడిపిస్తున్న యువత



వంటావార్పు చేస్తున్న గిరిజనులు



జాతరలో పర్యటిస్తున్న ఈవో వి.వి సూర్యనారాయణ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ముద్దుబిడ్డ శంబర పోలమాంబ అమ్మవారి జాతరను సజావుగా జరిపించేందుకు అధికారులు, గ్రామపెద్దలు, రైతులు, ఉత్సవకమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, దేవాదాయశాఖ కృషి సత్ఫలితానిచ్చింది. గడిచిన నెలరోజులుగా శంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అంతా కలిసి చేపట్టిన చర్యలు మంచి ఫలితాన్నిచ్చాయి. జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనలో ఈ ఏడాది అధికారుల చర్యలు భక్తులకు సంతోషాన్ని మిగిల్చాయి. ఎక్కడా ఏలోటు కనిపించకుండా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

సిరిమానోత్సవం బాధ్యత గ్రామస్తులదే..

సిరిమాను కర్ర(తాడికర్ర)ను గుర్తించడంతోపాటు, కర్రను గ్రామానికి తీసుకువచ్చి, సిరిమానుగా మలిచి, నాటుబండిపై సిరిమాను కట్టి, సిరిమానును పురవీధుల్లో ఊరేగింపు, ఆఖరిఘట్టం వరకు గ్రామస్తులంతా బాధ్యతను వారి భుజాలపై వేసుకుని అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం కార్యక్రమాన్ని జరిపించారు.

సాలూరు సర్కిల్, మక్కువ పోలీసులు సేవలు భేష్

జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలతో సాలూరు సీఐ రామకృష్ణతోపాటు, మక్కువ ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు అందించిన సేవలు భేష్ అంటూ కొనియాడక తప్పదు. గడిచిన నెలరోజుల నుంచి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు చేపట్టారు. పార్కింగ్‌స్థలాల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, దొంగతనాల నివారణ, సిరిమాను సజావుగా సాగడం, రూట్‌మ్యాప్‌లు, బారికేడ్ల ఏర్పాట్లు, అలాగే జాతరకు వివిధ మండలాలనుంచి వచ్చిన 700మంది పోలీసులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించడంలో మక్కువ పోలీసులు శ్రమ సత్ఫలితాన్నిచ్చింది.

స్వచ్ఛంద సంస్థలు సేవలు అమోఘం

విశాఖపట్టణానికి చెందిన శ్రీసూర్య డెవలపర్స్ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదాన్ని అందించారు. అలాగే శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో క్యూల్లో నిల్చున్న భక్తులకు మంచినీరు అందించారు. గ్రామానికి చెందిన రమణమూర్తి కుటుంబసభ్యులు పులిహోర, మంచినీరు, మజ్జిగ భక్తులకు అందించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్



సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్



ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాటుచేసిన ట్యాంక్ వద్ద మంచినీరు తాగుతున్న భక్తులు



భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదంను అందిస్తున్న శ్రీసూర్య డెవలపర్స్ సభ్యులు



భక్తులకు సర్దిచెబుతున్న మక్కువ ఎస్సై వెంకటరమణ



ఎండలో భక్తులు



వైద్యశిబిరాన్ని సందర్శించిన ఆర్‌జేసీ సుబ్బారావు

'మధ్యాహ్న' కార్మికులను తొలగించడం అన్యాయం



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: రాజకీయ కుట్రతో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయమని మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం (సీఐటీయూ అనుబంధం) నాయకురాలు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె పార్వతీపురం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి నిర్వాహకులతో కలిసి వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో గల కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులుగా మూడు సంవత్సరాల నుంచి కొనసాగుతున్న కార్మికులను అక్రమంగా తొలగించి వారికి అనుకూలమైన వారిని నియమించడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం హయాంలో నియమించిన కార్మికుల పట్ల నేటి ప్రభుత్వ రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని వాపోయారు. ఎటువంటి కారణం లేకుండా కార్మికులను తొలగించాలని ప్రజాప్రతినిధులతో సహా జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా మొండిగా వ్యవహరించడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పాత వారినే కొనసాగించాలని గత తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారని, అయినప్పటికీ సంబంధంలేని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని తాము నిర్ణయించిన వారినే వంటవారిగా నియమించాలని, వారికి మాత్రమే వంట సామగ్రి అందివ్వాలని ప్రధానోపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం సరైనదికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వ ఉద్యోగస్తులు, కార్మికులపై రాజకీయ జోక్యం మానుకోవాలని, విద్యార్థులు, తల్లిదండ్రుల నిర్ణయం మేరకు పాత వారినే మధ్యాహ్నం భోజనం నిర్వాహకులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొర్లి. వెంకటరమణ, పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు కొండేటి రాధ, రెడ్డి హేమ, అగ్గాల స్వాతి, బొండపల్లి ముత్యాలమ్మ, ఇల్ల జ్యోతి పాల్గొనగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి.గంగునాయుడు, సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, కొల్లి సాంబమూర్తి, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్ సంపూర్ణ మద్దతు తెలిపారు.

కబ్జాకోర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి



తహసీల్దార్ జయలక్ష్మితో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు

పార్వతీపురంటౌన్: కబ్జాకోర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ సమితి ప్రతినిధులతో కలిసి వైకేఎం కాలనీ ఎదురుగా ఉన్న అఫీషియల్ కాలనీలో కబ్జాకు గురవుతున్న వెంకమ్మ చెరువు గెడ్డ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పార్వతీపురం తహసీల్దార్ జయలక్ష్మితో మాట్లాడుతూ పార్వతీపురంలో చెరువులు, గెడ్డలు తదితర నీటి వనరులతో పాటు ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు దర్జాగా కబ్జా చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కబ్జా జరుగుతున్న ప్రాంతంలో కబ్జాలను పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, సచివాలయ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కబ్జాకు గురవుతున్న వెంకమ్మ చెరువు గెడ్డకు తామర చెరువు, చలిచెరువు, వెంకమ్మ చెరువుతోపాటు దాదాపు పది చెరువుల నీటి ప్రవాహం వస్తుందని, ఆ ప్రవాహం సమీపంలోని లంకెల చెరువు ద్వారా ఆయకట్టు పొలాలకు వెళుతుందన్నారు. అటువంటి గెడ్డను కబ్జాదారులు దర్జాగా యంత్రాలతో చదును చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేజేటి దయామణి, చుక్క చంద్రరావు, భవిరిపూడి పోలినాయుడు, వందాన నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలి

పార్వతీపురంటౌన్: పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిలా కార్యదర్శి కూరంగి మన్మథరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాలలో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి అదే విధంగా హామీ ఇస్తూ ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు ఇస్తామన్నారని, ఇంటి స్థలాల కేటాయింపు పట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే అయినప్పటికీ, సిమెంట్ ఇటుక, ఇసుక, ఇనుము, కంకర తదితర సామగ్రి ధరలు పెరిగాయి కాబట్టి రూ.5 లక్షలు పెంచి గృహ నిర్మాణానికి సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపినాయుడు, రాంబాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి చట్టాన్ని సవరించాలి

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి చట్టాన్ని సవరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి కోసం హోటల్స్, రెస్టారెంట్లు, పార్కులకు పెట్టుబడులు పెట్టాలంటే 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం లోతైన అధ్యయనం చేసి సవరణ చేయాలని సాక్షాత్తు శాసన సభాపతి ప్రకటించారన్నారు. ఇది ఆదివాసులకు తీవ్ర ద్రోహం చేయడమేనని ఆదివాసులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం సవరణ చేస్తే ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతంలో బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలు ఆదివాసీ సంపదలైన సహజవనరులు, అడవులు, ఖనిజాలు, ప్రకృతి అందాలు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల జీవన విధానం ధ్వంసమవుతుందని తక్షణమే ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి ప్రకటన వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు.

భారత్ గ్యాస్ వినియోగదారుల ఇక్కట్లు

పార్వతీపురంటౌన్: భారత్ గ్యాస్ కోసం నెల రోజుల నుంచి ఇండెంట్ పెట్టుకుంటున్నప్పటికీ గ్యాస్ బండ్లను సంబంధిత యజమానులు డెలివరీ చేయకపోవడంతో సోమవారం పట్టణంలో సారికి వీధి జంక్షన్‌లో ఉన్న భారత్ గ్యాస్ ఆఫీసుకు వినియోగదారులు తమ గోడు వెళ్లబుచ్చేందుకు వచ్చారు. ఆ సమయంలో గ్యాస్ ఆఫీసుకు తాళం వేసి ఉండడంతో విని యోగదారులు అసహనానికి గురయ్యారు. అక్కడ ఉన్న డెలివరీ బాయ్స్ గ్యాస్ బండ తీసుకుని వస్తే గ్యాస్ ఇస్తామని చెప్పడంతో వినియోగదారులు వారి ఇళ్లకు వెళ్లి ఖాళీ గ్యాస్ బండలు తీసుకు రావడంతో ఉన్న కొద్దిపాటి గ్యాస్ బండ్లను డెలివరీ చేశారు. దీంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

పాచిపెంట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వస్తున్న రోగులు, వారికి అందిస్తున్న చికిత్స తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరూ నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినభోగిలి వద్ద శంబర యాత్రికులకు సేవలు



శంబరకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు



మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

సీతానగరం: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పుగా పూజించే శంబర పోలమాంబ జాతరకు చినభోగిలి మీదుగా వెళ్తున్న వారికి ఆర్టీసీ యాజమన్య సభ్యులు, స్థానిక ఉప ఆరోగ్యకేంద్రం సిబ్బంది సేవా కార్యక్రమాలు మంగళవారం ఏర్పాటు చేశారు. శంబర పోలమాంబ జాతరకు మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్న నమ్మకంతో వారికి రాకపోకల సౌకర్యం, ఉచితంగా వైద్యసేవలు అందించడానికి చినభోగిలి జంక్షన్ రాష్ట్ర రహదారిని ఆనుకుని పార్వతీపురం ఆర్టీసీ యాజమాన్యం టెంట్‌లు ఏర్పాటు చేసి ఇద్దరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, 8 మంది వలంటీర్లను సేవల నిమిత్తం నియమించింది. అలాగే సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు అనారోగ్యానికి గురైన వృద్ధుడికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పరీక్షల సమయంలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణ, ఆరోగ్యం మెరుగు కోసం కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వైద్య బృందంతో కలిసి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్య రీత్యా ఇబ్బందులు ఎదుర్కోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలపై డాక్టర్ జగన్‌మోహన్ అవగాహన కల్పించారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, రక్తహీనత వల్ల అలసట, ఏకాగ్రత కోల్పోవడం తద్వారా చదువుపై ప్రభావం పడుతుందన్నారు. శరీరానికి తగు పోషకాలు అందించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని, ఆకుకూరలు, అందుబాటులో ఉండే పండ్లు మనకు అవసరమైన శక్తిని అందించి ఉత్తేజంగా ఉంచి ఏకాగ్రతకు తోడ్పడతాయని, ఎప్పటికప్పుడు నీరు తాగాలని, నిమ్మరసం లాంటి అందుబాటులో ఉండే ద్రావణాలు తీసుకోవడం వల్ల విటమిన్-సి రోగనిరోధకశక్తికి దోహద పడి, శరీరంలో ఐరన్ శోషణకు తోడ్పడుతుందన్నారు. సాధ్యమైనంతవరకు నూనె, కొవ్వు శాతం ఉన్న ఆహారం, ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, వాటిద్వారా శరీరం త్వరగా అలసటకు గురవుతుందన్నారు. బాలికలు ప్రతిరోజూ ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని సూచించారు. రుతుక్రమం సమస్యలు ఉంటే వెంటనే వైద్యసిబ్బందికి తెలియ జేయాలని చెప్పారు. చేతుల పరిశుభ్రత తప్పనిసరి అని హ్యాండ్ వాష్ పద్ధతులను వివరించారు. విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే వైద్యసిబ్బంది సత్వరమే స్పందించి తగు చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర, ప్రిన్సిపాల్ జె.రామారావు, లెక్చరర్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఏడాది దూడ పుడితే పాడిరైతుకు మేలు



గర్భకోశ ఉచిత పశువైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి పాల ఉత్పత్తి పెంచడంతో పాటు ప్రతి ఏడాది దూడ పుట్టే విధంగా కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు అధ్యక్షతన రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ పాడిరైతులు పాల ఉత్పత్తి లాభసాటి అనుకుని చూడి కట్టించడంలో అశ్రద్ధవహిస్తారన్నారు. ప్రతి దూడ 18 నెలలకే జతకు వస్తుందన్నారు. ఆవు అయితే 9నెలలు చూడితోను, గేదె అయితే 10 నెలలు చూడితో ఉంటుందన్నారు. పశువులు ఈనిన మూడునెలలకే జతకు వస్తాయని అప్పట్లో పాలపై ధ్యాస ఉన్నప్పుడు, జతకు వచ్చిందన్న విషయం గుర్తించరన్నారు. పాడి పశువు ఈనిన 90 రోజుల తరువాత జతకట్టించాల్సి ఉంటుందని, ఈతకు ఈతకు మధ్యదూరం తగ్గించడం వల్ల కాన్పులు ఎక్కువై రైతులు దూడల సంఖ్య పెరగడంతో ఆర్థికంగా లబ్ధిపొందవచ్చని తెలియజేశారు. 9 నెలలు పాలు తీసిన పశువులు గొడ్డుమోతుగా మారుతాయని తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోవడం ఖాయమన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పెంచుకున్న పాడి పశువులకు ఆరోగ్యపరీక్షల్లో భాగంగా గర్భకోశ పరీక్షలు చేయించే ముందు పాడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. దూడదశనుంచే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దూడపుట్టిన 3 నెలలవరకూ పాలిచ్చిన వాటిలో 10శాతం పాలు దూడకు ఇవ్వాలని చెప్పారు. ప్రతినెలకోపర్యాయం ఏలిక పాముల నివారణమందులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఉపసర్పంచ్ కె.అరవింద్, మాజీసర్పంచ్ బూడితి శ్రీనివాసరావు, మాజీఎంపీటీసీ సబ్బాన శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు, ఎ.గోపాల మిత్రలు, పశువైద్యసహాయకులు, గ్రామ పాడి రైతులు హాజరయ్యారు.